క్లుప్తంగా

కేంద్ర బృందం పర్యటన



లచ్చింపేటలో ప్రజలతో మాట్లాడుతున్న కేంద్రబృందం

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట, జమ్మాదేవిపేట గ్రామాల్లో కేంద్ర రీసెర్చ్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ ప్రతినిధులు శనివారం పర్యటించారు. పింఛన్ లబ్ధిదారులు, ఉపాధి వేతనదారులతో మాట్లాడుతూ పింఛన్, ఉపాధి వేతనాలపై ఆరా తీశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై ఉపాధి, వెలుగు, హౌసింగ్, ఐసీడీఎస్ శాఖల అధికారులతో సమీక్షించారు. హౌసింగ్ డీఈ శ్రీనివాస్, ఎంపీడీఓ కె.రూపేష్, ఉపాధి హామీ ఏపీడీ శారదాదేవి, ఈఓపీఆర్డీ జ్ఞానేశ్వరరావు, వెలుగు ఏపీఎం అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్న సుజాత

చీపురుపల్లి: నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని యోగా నిపుణులు గవిడి సుజాత తెలిపారు. పట్టణంలోని శ్రీ సత్యరామ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు, సూర్యనమస్కారాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రస్తుత ఒత్తిడి ప్రపంచంలో బీపీ, సుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా యోగా చేయాలన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



ఆతవ పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

వేపాడ: మండలంలోని ఆతవ,సోంపురం ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈఓ జి.శ్రీదేవి శనివారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పథకం నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యం పరీక్షించారు.

చైతన్య యాత్రను విజయవంతం చేయండి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఎస్పీ ప్రతినిధులు

చీపురుపల్లి: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా జిల్లా కేంద్రంలో చేపడుతున్న చైతన్య యాత్రను అంతా విజయవంతం చేయాలని బీఎస్పీ ప్రతినిధులు కోరారు. పట్టణంలోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి శనివారం వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు సబ్బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సఖీ గ్రూపులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: ప్రతీ ఉన్నత పాఠశాలలోనూ బాలికలకు సంబంధించిన సఖీ గ్రూపులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఏ.వేదవతి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సఖి గ్రూపులపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమారదశలో బాలికల రక్షణ, ఆరోగ్యం,పౌష్టికాహారం, ఉన్నత విద్య తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ గ్రూపులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో వాటిని నిర్వహిస్తామని, ఈ గ్రూపుల్లో ఉపాధ్యాయినులు, వైద్య,ఆరోగ్య సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. గ్రామ సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, వైస్ సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, ఎంపీటీసీ బండారు శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేపాడలో..

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఎస్.కోట సీతారాంపురం గ్రామంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో 'సఖి' గ్రూపులపై బాలికలకు శనివారం అవగాహన కల్పించారు.

పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని గృహ సారథులు, వలంటీర్లకు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి మండల వ్యాప్తంగా ఇటీవల నియమించిన గృహ సారథులతో పాటు వలంటీర్లతో గర్భాం గ్రామంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు అంతా సమష్టిగా పని చేసి పార్టీని గ్రామస్థాయిలో మరింత పటిష్టం చేయాలని సూచించారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదలకు మేలు చేస్తుంటే... ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయని మండిపడ్డారు. వారి కుట్రలు, కుయుక్తులను ప్రజలు గమనిస్తున్నారని, మళ్లీ వారికి తగిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధిపథంలో పయనిస్తోందని అన్నారు. ప్రతీ గ్రామానికి ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ స్థానిక నాయకులు పలు గ్రామాలకు చేయలేక వదిలేసిన రోడ్డు పనులను తాము పూర్తి చేశామన్నారు.

పదవుల కోసమే పాదయాత్ర

అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోకుండా, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయని చంద్రబాబు నాయుడు, మళ్లీ ప్రజలను మభ్యపెట్టి అధికారం దక్కించు కోవాలని ఆయన తనయుడు లోకేష్‌తో పాదయాత్ర చేయిస్తున్నారని జెడ్పీ చైర్మన్ అన్నారు. వారి పాదయాత్ర ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు కాదని, కేవలం పదవుల కోసమేనని ఎద్దేవా చేశారు. అసలైన పాదయాత్ర అంటే వైఎస్సార్ కుటుంబానిదేనని, వైఎస్.రాజశేఖరరెడ్డి, వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలు కష్టాలను నేరుగా చూసి, తెలుసుకున్నారని గుర్తు చేశారు. ప్రజల అవసరాల దృష్ట్యా వైఎస్సార్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి అడుగుజాడల్లోనే పని చేస్తున్నారని అన్నారు. అనంతరం జిల్లా, రాష్ట్రస్థాయి దివ్యాంగ వలంటీర్ల క్రీడా పోటీల్లో రాణించిన ఇప్పలవలసకు చెందిన మంత్రి పైడినాయుడును జెడ్పీచైర్మన్ సన్మానించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, సీనియర్ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కోట్ల మోతీలాల్‌నాయుడు, మండల జేసీఎస్ (జగనన్న సచివాలయ కన్వీనర్) కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, నాయకులు బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, కర్రోతు నాగేశ్వరరావు, కందుల మల్లికార్జునరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా గడప గడపకూ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ధర్మవరం గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని రెండో రోజు శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి, వారికి అందిన సంక్షేమాన్ని, ఆ ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని విచారించి వాటిని పరిష్కరిస్తూ ముందుకు సాగారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పని తీరుపై పలువురి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఏ ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని, పని చేయని వారిని పక్కన పెట్టేందుకు ఎంత మాత్రం ఆలోచించమని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్య లు తెలుసుకునేందుకే సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో గడప గడపకూ వస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో అర్హతే కొలమానంగా పథకాలు అందుతున్నాయని, అవినీతికి అవకాశం లేని పాలన ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపీటీసీ డోల కనకమహాలక్ష్మి, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, షేక్ రెహమాన్, సర్పంచ్ కె.వెంకటరావు, గర్రెడ్డి పైడితల్లి, అల్లు మహాలక్ష్మునాయుడు, అల్లు కిట్టుబాబు, సుధీర్, లగుడు అవతారం, సత్యారావు, శ్రీనివాసరావు, జి.పైడిరాజు, వరి కృష్ణ, చింతల మూర్తి, వేమలి జగదీష్, రేవళ్లపాలెం రామకృష్ణ, రంది అనంత్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామసచివాలయ సంక్షేమ అధికారి (వెల్ఫేర్ అసిస్టెంట్)పై ఆ సచివాలయ పరిధి వలంటీర్లు మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. జగనన్న చేదోడు పథకానికి సంబంధించి గడువు ముగింపు తేదీ గురించి వెల్ఫేర్ అసిస్టెంట్ సమాచారం ఇవ్వకపోవడంతో సుమారు ఇరవై మంది అర్హులు పథకానికి దూరమయ్యారని వలంటీర్లు గౌరినాయుడు, పైడిరాజు, నాగ తదితరులు ఆరోపించారు. మూడు రోజుల నుంచి లబ్ధిదారులతో కలిసి సచివాలయానికి వెళ్లినా వెల్ఫేర్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, దీంతో 20 మంది పథకానికి దూరమయ్యారని ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వివరించారు.

బాధ్యతతో విద్యాబోధన



సమావేశానికి హాజరైన హెచ్‌ఎంలు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలని ఎంఈఓ జి.శ్రీదేవి సూచించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలతో స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యాబోధన పరిశీలన, సిలబస్, పరీక్షపత్రాల మూల్యాంకన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, ఎఫ్ఏఎస్ఏ పేపర్ల పంపిణీ తదితర అంశాల్లో హెచ్‌ఎంలదే బాధ్యతని అన్నారు.

'చేదోడు' అర్హులపై ఆరా



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: మండల కేంద్రంలోని గ్రామసచివాలయాన్ని ఎంపీడీఓ పట్నాయక్ శనివారం సందర్శించారు. సచివాలయం పరిధిలో చేదోడు పథకానికి సంబంధించి అర్హుల వివరాలపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్‌తో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పథకానికి అర్హతలను పరిశీలించారు. అర్హత ఉన్న వారు వెంటనే ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, లేబర్ సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కండి



బొండపల్లి: బోడసింగిపేటలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్



గజపతినగరం: పురిటిపెంటలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రమేష్, జెడ్పీటీసీ తవుడు, తదితరులు

బొండపల్లి: జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించి ఉగాది నాటికి లబ్ధిదారులను సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఎంపీపీ చల్ల చలంనాయుడు, మండల ప్రత్యేక అధికారి డి.ఎల్.వి.దుర్గాప్రసాద్ అధికారులకు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని బోడసింగిపేట జగనన్న లేఅవుట్‌లో శనివారం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించడంతో పాటు లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇంకా నిర్మాణ పనులను మొదలు పెట్టని వారు పనులను ప్రారంభించేలా చూడాలన్నారు. ఎంపీడీఓ దే.వేదవతి, గృహనిర్మాణ శాఖ ఏఈఈ రమణరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోడసింగి జగదీశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వేగవంతం చేయండి

గజపతినగరం: జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని అధికారులకు మండల ప్రత్యేక అధికారి రమేష్ సూచించారు. హౌసింగ్ డేలో భాగంగా పురిటిపెంట జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాల దశల ఆధారంగా బిల్లులను సకాలంలో చెల్లిస్తామని, నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బెల్లాన త్రినాథరావు, ఎంపీడీఓ కిశోర్ కుమార్, వెలుగు ఏపీఎం యు.జగదీష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నానిబాబు, స్థానిక నాయకులు రాజు, జి.సన్యాసిరావు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఆలయ పునః ప్రతిష్ట



గజపతినగరం: ఆలయ ప్రతిష్ట పూజల్లో భక్తులు



దత్తిరాజేరు: ఆలయగోపురంపై పూర్ణ కలశాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువ వీధిలో పైడితల్లి అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలను మాజీ సర్పంచ్ కందుల చిన్నయ్య స్వామి ఆధ్వర్యంలో శ్రీరామదూత సేవాసంఘం సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో సర్పంచ్ బేత శ్రీదేవి, రవి దంపతులు పునర్నిర్మించిన బంగారమ్మతల్లి ఆలయ పునఃప్రతిష్ట ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. మూడురోజులుగా వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆలయం గోపురంపై పూర్ణ కలశాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అన్న సమారాధన చేశారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు పంచాయతీ శివారు కొత్తపాలెం గ్రామంలో దేవదాయ ధర్మాదాయ శాఖ నుంచి మంజూరైన రూ.30 లక్షలతో రామాలయం నిర్మాణానికి గ్రామపెద్దల ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, గ్రామ పెద్దలు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు పూజలు చేశారు.

రూ.2 లక్షల విరాళం

రామాలయం నిర్మాణానికి మల్లివీడు గ్రామానికి చెందిన బోను సన్యాసిరావు(సన్ని) రూ.2 లక్షలు విరాళం ప్రకటించారు. ఆలయ నిర్మాణ కమిటీకి శనివారం రూ.లక్ష అందజేశారు.మిగతా లక్ష రూపాయాలు నిర్మాణం అనంతరం ఆలయానికి రంగులు వేసేందుకు అందజేయనున్నట్లు దాత తెలిపారు.

లేఅవుట్‌లకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం

బొండపల్లి: జగనన్న లేఅవుట్‌లలో పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, ఇళ్ల నిర్మాణదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసు కోవా లని ఎంపీపీ చల్ల చలం నాయుడు, మండల ప్రత్యేక అధికారి డి.ఎల్.వి.దుర్గాప్రసాద్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, వీధి లైట్ల ఏర్పాటు పనులు త్వరగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు,బాలింతలను గుర్తించి వారికి మంచి పౌష్టికాహారం అందించేలా చూడాలని బొండపల్లి, దేవుపల్లి పీహెచ్‌సీల వైద్య సిబ్బందికి, ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎంపీడీఓ ఏ.వేదవతి, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

గజపతినగరం: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి పి. రమేష్ సూచించా రు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. మరుపల్లి పశువైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని 15,750 గొర్రెలు, మేక పిల్లలకు ఫిబ్రవరి 1న నుంచి పీపీఆర్ వ్యాక్సిన్ వేయనున్నామని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవ సాయ, వైద్య, రెవెన్యూ,హౌసింగ్, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు తమ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఎంపీడీఓ కిశోర్‌కుమార్, సీనియర్ పరిపాలన అధికారి పి.సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు




మెరకముడిదాం: సోమలింగాపురంలో సూర్యనారాయణ స్వామికి క్షీరాభిషేకం



మెరకముడిదాం: పూజలు నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త, ఎస్.వి.రమణరాజు దంపతులు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో శ్రీసూర్యనారాయణ మూర్తి స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే ఆలయ ధర్మకర్త, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు దంపతులు, ఆయన సోదరులు ఆధ్వర్యంలో అర్చకులు ఆరవెల్లి కృష్ణశర్మ, ఆరవెల్లి శ్రీనివాసశర్మ, కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులను స్వామివారి నిజరూప దర్శనానికి అనమతిచ్చారు. చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



శృంగవరపుకోట: ఎస్.కోటలో సూర్యదేవాలయం వద్ద బారులు తీరిన మహిళలు



శృంగవరపుకోట: పూజలు అందుకుంటున్న ఆదిత్యుడు

ఎస్.కోటలో...

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులోని సూర్య దేవాలయంలో రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తెల్లవారక ముందే ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు నివేదించారు. ఆలయ అర్చకులు సూర్యనారాయణ తదితరులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు, చేశారు. మహిళలు సూర్యదేవాలయం ప్రాంగణంలో దీపారాధన చేశారు. అలాగే గ్రామదేవత దారగంగమ్మను మహిళలు దర్శించుకున్నారు. పలువురు ఇళ్ల వద్ద జిల్లేడు ఆకులుపైన, రేగుపండ్లు ఉంచి అభ్యంగస్నానాలు చేశారు. పిడకల పొయ్యిలపై ఆవుపాలు పొంగించి కొత్తబెల్లం, బియ్యం, చెరుకుగడలతో క్షీరాన్నం వండి స్వామి వారికి నివేదించి పూజలు చేశారు.



జామి: పుష్పగిరి గ్రామంలో సూర్యభగవానుడి ఊరేగింపు

పుష్పగిరిలో..

జామి: మండలంలోని పుష్పగిరి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఆలయ అర్చకులు రవిస్వామి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పాలు పొంగించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సూర్య భగవానుడి విగ్రహాన్ని ఊరేగిం చారు. భీమసింగి వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాదస్వామి ఆధ్వర్యంలో పూజలు, ఆదిత్య హృదయ పారాయణం చేశారు.

రాజరాజేశ్వరిదేవిని తాకిన సూర్యకిరణాలు



అమ్మవారిని తాకిన సూర్య కిరణాలు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని శనివారం సూర్యకిరణాలు తాకాయి. రథసప్తమి రోజున అమ్మవారిని సూర్యకిరణాలు తాకుతాయని ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు విద్యార్థులతో సూర్యనమస్కారాలు చేయించారు.

వైభవంగా గ్రామదేవతల తీర్థం



వేపాడలో గ్రామదేవత ఆలయానికి వెళుతున్న భక్తులు

వేపాడ: మండల కేంద్రంలో గ్రామదేవతలు పరదేశమ్మ, ముత్యాలమ్మ, బల్లంకిలో మరిడిమాంబ అమ్మవార్ల తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు ఆయా గ్రామాల భక్తులతో పాటు సమీప గ్రామాల భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం సందర్భంగా గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వేపాడలో పరదేశమ్మ, ముత్యాలమ్మ తల్లి ఉత్సవ కమిటీల నేతృత్వంలో శనివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో కబడ్డీ పోటీలు నిర్వహించారు. 14 జట్లు పాల్గొన్నాయి. వరుస మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించగా, ప్రథమ స్థానంలో నిలిచిన బక్కునాయుడుపేట మోడల్ స్కూలు విద్యార్థులకు రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు. బల్లంకిలో నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో 25 జతల ఎద్దులు పాల్గొనగా, అజనగిరికి చెందిన పరవాడ నాయుడు ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచి రూ.12 వేలు నగదు బహుమతి గెలుచుకున్నాయి. వరుసగా ఎనిమిది స్థానాల్లో నిలిచిన ఎద్దులకు నగదు బహుమతులు అందించారు.



బల్లంకిలో ఎడ్ల పరుగు ప్రదర్శన